క్లుప్తంగా

నరసన్న సన్నిధిలో విద్యుత్ వెలుగులు

మధురపూడి: కోరుకొండలోని **లక్ష్మీనరసింహ** స్వామి దేవస్థానంలో విద్యుత్ **వెలుగులను** పునరుద్ధరించారు. ఇటీవల **ఆలయం, కొండ** పైన లైట్లు వెలగడం లేదు. కో**తుల కారణంగా** స్తంభాలకున్న తీగలు తెగిపో**యి, ఈ పరిస్థితి** ఏర్పడింది. ఈ నేపథ్యం**లో దేవస్థానం** అధికారులు చర్యలు చేపట్టారు.

62 మందికి వైద్యసేవలు

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం కస్తూర్బాగాంధీ ఆశ్రమంలో రాజమహేంద్రవరానికి చెందిన హరిత న్యూరో సెంటర్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన వైద్యశిబిరంలో 62 మందికి సేవలు అందించారు. న్యూరో ఫిజీషియన్, స్ట్రోక్ వైద్యనిపుణులు డాక్టర్ క్రొవ్విడి రాజేష్, డాక్టర్ సత్యం రమేష్‌బాబు వైద్యసేవలు అందించారు. అవసరమైన వారికి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్రొవ్విడి నరసింహరావు, రామరాజు, శేఖర్ పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు

సీతానగరం: రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరు నుంచి సీతానగరం నాలుగు లైన్ల రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా కొత్త విద్యుత్ స్తంభాలను విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నారు. రఘుదేవపురం పంచాయతీ రవీంద్ర కాలనీ వద్ద పాత స్తంభాలను తొలగించి, కొత్తవాటిని ఏర్పాటు చేస్తున్నారు. ఈ పనులు చురుగ్గా సాగుతున్నాయి.

నేడు శాకంబరిగా కాత్యాయనీదేవి

రంగంపేట: చంద్రేడులోని కాత్యాయనీ సమేత చంద్రశేఖరస్వామి ఆలయంలో సోమవారం అమ్మవారిని శాకంబరిగా అలంకరించనున్నట్టు ఆలయ అర్చకుడు మైలవరపు కృష్ణశర్మ తెలిపారు. ఆషాఢ శుద్ధ పౌర్ణమి సందర్భంగా కాత్యాయనీదేవిని కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, పుష్పాలతో అలంకరిస్తామన్నారు. భక్తులందరూ వచ్చి అమ్మవారిని దర్శించుకోవాలని ఆయన కోరారు.

గోదావరి నీటి సరఫరాకు అంతరాయం



ధవళేశ్వరం వద్ద గోదావరి బండ్‌పై పైపులైన్ లీకేజీలతో పక్కనే ఉన్న తోటలోకి వస్తున్న నీరు

రాజానగరం: పూర్వపు కడియం నియోజకవర్గంలోని కొన్ని గ్రామాల ప్రజలకు పైపులైను ద్వారా జరుగుతున్న గోదావరి జలాల పంపిణీకి బ్రేక్ పడింది. ధవళేశ్వరం వద్ద గోదావరి బండ్ నుంచి వేసిన పైపులైన్‌లలో ఏర్పడిన లీకేజీ కారణంగా ఈ సమస్య ఎదురైందని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావు ఆదివారం విలేకరులకు తెలిపారు. దీనివల్ల రాజమహేంద్రవరం రూరల్‌లో 5, కడియం మండలంలో 11, రాజానగరం మండలంలో 10 గ్రామాలకు సోమవారం నుంచి గురువారం వరకూ నాలుగు రోజుల పాటు గోదావరి జలాలు సరఫరా చేసే అవకాశం లేదన్నారు. పైపులైన్ల లీకేజీలను సరిచేసి శుక్రవారం నుంచి నీటి సరఫరాను పునరుద్ధరిస్తామన్నారు.

సూర్యదేవునికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో సూర్యదేవుడు

పెదపూడి: జి.మామిడాడలో ప్రసిద్ధి చెందిన ఉషా, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత సూర్యదేవుని దర్శనానికి ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి వెంకట నరసింహాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకాలు, వ్రత పూజలు నిర్వహించారు. భక్తులకు ఆలయ కమిటీ తీర్థ ప్రసాదాలు, అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసింది.

ఉత్సాహంగా ఎడ్లబళ్ల పోటీలు



పోటీలో పాల్గొన్న ఎద్దులు

రాజానగరం: మండలంలోని చక్రద్వారబంధంలో ఆదివారం ఎడ్లబళ్ల పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ముంగర తాతి, గంగారత్నం దంపతుల ఆధ్వర్యంలో వీటిని నిర్వహించారు. మొదటి బహుమతిని సీతారామపురానికి చెందిన నూనె రామసూర్య, రెండో బహుమతిని ముంగరకు చెందిన నాగేశ్వరరావు, మూడో బహుమతిని గాడాలకు చెందిన వేములూరి కాపు ఎడ్లు గెలుచుకున్నాయి.

కూర కుధరడం లేదు

- మండుతున్న కూరగాయల ధరలు
- కేజీ రూ.100 దాటిన టమాటా, పచ్చిమిర్చి, చిక్కుడు
- చికెన్‌తో పోటీ పడుతున్న అల్లం
- ఆందోళన చెందుతున్న సామాన్య, మధ్యతరగతి ప్రజలు



గోకవరంలో అమ్మకానికి సిద్ధం చేసిన కూరగాయలు

గోకవరం: కూరగాయల ధరలు మండుతున్నాయి. నిత్యావసరాల్లో ప్రధానమైన కూరగాయల ధరలు ఒక్కసారిగా పెరగడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా టమాటా, అల్లం, పచ్చిమిర్చిని వంటింట్లో మహిళలు ప్రతి కూరలోనూ వాడుతుంటారు. వీటిలో టమాటా, పచ్చిమిర్చి, చిక్కుడు ధర ప్రస్తుతం కేజీ రూ.100 పైబడి ఉండగా అల్లం ధర చికెన్‌తో పోటీ పడుతోంది. ధరలు భారీగా పెరగడంతో సామాన్యులకు ఏం కొనాలో, ఏం తినాలో తెలియని పరిస్థితి నెలకొంది.

20 రోజుల్లో రెట్టింపు

కొద్దిరోజుల క్రితం వరకు కేజీ రూ.20 లోపు ఉండే కూరగాయలన్నీ ఇప్పుడు రెట్టింపు ధరలు పలుకుతున్నాయి. బహిరంగ మార్కెట్‌లో టమాటా, పచ్చిమిర్చి, చిక్కుడు కేజీ రూ.120 ఉండగా, అల్లం రూ.220 ఉంది. క్యాప్సికమ్, బీరకాయ, వంకాయ, చామదుంప వంటివి రూ.50 పైబడి ఉన్నాయి. మిగిలిన కూరగాయలకు సైతం ధరలు పెరగడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు బెంబేలెత్తుతున్నారు.

మండలంలోని గోకవరం, కొత్తపల్లి గ్రామాల్లో ప్రతి సోమవారం వారపుసంత జరుగుతుంది. సాధారణంగా బయట మార్కెట్ కంటే ఈ వారపు సంతలో కూరగాయల ధరలు తక్కువగా ఉంటాయి. రైతులే నేరుగా ఇక్కడకు కూరగాయలు తెచ్చి విక్రయిస్తారు. కాగా ప్రస్తుతం వారపు సంతలో సైతం కూరగాయల ధరలు అధికంగానే ఉన్నాయి. మండలంలోని గోకవరం, అచ్యుతాపురం, గుమ్మళ్లదొడ్డి, తిరుమలాయపాలెం, కొత్తపల్లి, కామరాజుపేట, తదితర గ్రామాల్లో రైతులు వంకాయ, దొండకాయ, బీరకాయ, ఆనప, ఆకాకర, బెండకాయ, అరటికాయ తదితర కూరగాయలను పండిస్తున్నారు. అలాగే ఏజెన్సీలోని దేవీపట్నం మండలంలో వంకాయలు విరివిగా పండిస్తారు. ఇటీవల కురిసిన వర్షాలకు పంటలు దెబ్బతినడంతో కూరగాయల ధరలు పెరిగినట్టు రైతులు చెబుతున్నారు. మరో నెలరోజుల పాటు ఇదే పరిస్థితి ఉండే అవకాశం ఉందని వ్యాపారులు భావిస్తున్నారు. మరోపక్క గత వారంతో పోలిస్తే కోడిమాంసం ధర రూ.40 వరకూ తగ్గింది. ప్రస్తుతం చికెన్ బ్రాయిలర్ రూ.240, ఫారం రూ.200కు విక్రయిస్తున్నారు. ప్రస్తుతం కూరగాయల్లో ప్రధానపాత్ర పోషించే ఉల్లి ధర రూ.20 ఉండటం సానుకూలాంశంగా ప్రజలు భావిస్తున్నారు.

ప్రస్తుతం గోకవరం మార్కెట్లో కూరగాయల ధరలు (కేజీల్లో)

కూరగాయలు	ధర (రూ.)
ఉల్లిపాయలు	20
అల్లం	220
టమాటా	120
చిక్కుడుకాయ	120
క్యాప్సికమ్	80
పచ్చిమిర్చి	120
వంకాయ	60
బీరకాయ	60
బీట్‌రూట్	40
క్యారెట్	35
బెండకాయ	35
దొండకాయ	35
చామదుంప	50
బంగాళదుంప	25
క్యాబేజీ	25
కీరదోస	40
చిలకదదుంప	40
ములక్కాడ	50

అమ్మకాలు తగ్గాయి

గత వారం రోజులుగా కూరగాయల ధరలు పెరుగుతున్నాయి. మండలంలో పంటలు దెబ్బతినడంతో దిగుబడి తగ్గింది. ఆ ప్రభావం ధరలపై పడింది. ధరలు పెరగడంతో అమ్మకాలు సైతం తగ్గాయి.
– సూర్యచంద్ర, కూరగాయల వ్యాపారి, గోకవరం

పాలచర్ల పీహెచ్‌సీ తనిఖీ



ఆస్పత్రిని పరిశీలిస్తున్న డాక్టర్ హనుమంతరావు

మధురపూడి: వైద్య,ఆరోగ్య శాఖ రాష్ట్రస్థాయి అధికారి (ఎంహెచ్ఎస్) డాక్టర్ హనుమంతరావు ఆదివారం రాజానగరం మండలం పాలచర్ల పీహెచ్‌సీని తనిఖీ చేశారు. అక్కడ డాక్టర్లు, సిబ్బంది పనితీరు, ఆరోగ్య కార్యక్రమాలను తెలుసుకున్నారు. ఆయన వెంట జిల్లా డీఎల్‌టీఏ అధికారి డాక్టర్ వసుంధర, నోడల్ అధికారి లక్ష్మీదేవి, పీహెచ్‌సీ అధికారి బెనడిక్ట్ ఉన్నారు.

వైఎస్సార్ పంటల బీమా విడుదల

అనపర్తి: మండలంలోని ఐదు గ్రామాల్లో రైతులకు వైఎస్సార్ ఉచిత పంటల బీమా సొమ్ము విడుదలైనట్టు మండల వ్యవసాయ అధికారి బి.సురేష్‌కుమార్ తెలిపారు. దిగుబడి ఆధారంగా వరి పంటకు గాను మండలంలోని దుప్పలపూడి, అనపర్తి, పెడపర్తి గ్రామాల్లోని 2,489 మంది రైతులకు రూ.72,62,447, వాతావరణ ఆధారిత బీమా కింద ఆరుతడి పంటలకు గాను మండలంలోని మహేంద్రవాడ, కొప్పవరం గ్రామాలకు చెందిన 15 మంది రైతులకు రూ.47,402 బీమా మంజూరైనట్టు తెలిపారు. వీటికి సంబంధించిన జాబితాలను ఆయా రైతు భరోసా కేంద్రాల్లో ఉంచామని ఏఓ తెలిపారు.

ఆనందమని 'పింఛన్'

98 శాతం పంపిణీ పూర్తి



చంద్రేడులో వృద్ధురాలికి పింఛను అందిస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ జానీమహమ్మద్



పెద్దాపురంలో వృద్ధురాలికి పింఛను అందిస్తున్న వలంటీర్ ప్రశాంతి

రంగంపేట: ప్రతి నెలా ఒకటో తేదీన తెల్లవారుజాము నుంచే తలుపుతట్టి మరీ వైఎస్సార్ పింఛన్ కానుకను వలంటీర్లు అందజేస్తుండడంతో అవ్వతాతల మోముల్లో ఆనందం వికసిస్తోంది. మండలంలో మొత్తం 8855 మంది లబ్ధిదారులండగా ప్రభుత్వం రూ.2,43,30,750 మంజూరు చేసింది. శని, ఆదివారాల్లో మండలంలో 98 శాతం పింఛన్లు పంపిణీ జరిగింది. మొదటి రోజు ఉదయం 6 గంటల నుంచే వెల్ఫేర్ అసిస్టెంట్లు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. కొందరు లబ్ధిదారులు వివిధ కారణాలతో అందుబాటులో లేకపోవడంతో రెండో రోజు పింఛన్ అందించారు.

పెద్దాపురం వెళ్లి పింఛన్ అందజేత

బిక్కవోలు: పందలపాక గ్రామ సచివాలయం–2 వలంటీర్ల మచ్చా ప్రశాంతి పెద్దాపురం వెళ్లి వృద్ధురాలికి పింఛను అందజేశారు. ఆదివారం తన పరిధిలో ఉన్న షేక్ మస్తాన్ బీబీ అనే వృద్ధురాలి అనారోగ్యం కారణంతో పెద్దాపురం బంధువులు ఇంటి వద్ద ఉంటోందని తెలుసుకొని అక్కడకు వెళ్లి పింఛను అందించారు. ప్రశాంతిని పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు సత్తి హరి ప్రసాద్ రెడ్డి తదితరులు అభినందించారు.

జగన్ పాలనలో అన్ని వర్గాల సంక్షేమం

- ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి
- రామేశ్వరంలో గడప గడపకూ మన ప్రభుత్వం



రామేశ్వరంలో పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. రామేశ్వరంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు లబ్ధిని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించడమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమన్నారు. ప్రజలకు ప్రభుత్వ పథకాలు లబ్ధి వివరిస్తుండగా ఒక్క జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోనే తమకు అనేక సంక్షేమ పథకాలు అందాయని తామంత జగన్‌కు అండగా నిలిచి మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకుంటామని ప్రజలు చెబుతున్నారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాలయ వెంకటలక్ష్మి, సర్పంచి కొటికలపూడి చినబాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు బసవ విజయకుమారి, గ్రామ కన్వీనర్ గాజుల మణికంఠ, ఆలయ కమిటీ చైర్మన్ గంగుమళ్ల సుబ్రహ్మణ్యం, స్థానిక పార్టీ నేతలు కొటికలపూడి గోపి, తిరుమలశెట్టి వెంకటరమణ, దుళ్ల వీరబాబు పాల్గొన్నారు.

అరటి రైతులకు నష్టపరిహారం

రాజానగరం: ఖరీఫ్ సీజన్‌లో ఈదురు గాలులు, తుపానుల కారణంగా మండలంలోని భూపాలపట్నం, నామవరం గ్రామాల్లో అరటి పంట కోల్పోయిన 9 మంది రైతులకు రూ.21,332 నష్ట పరిహారాన్ని ప్రభుత్వం మంజూరు చేసిందని మండల వ్యవసాయాధికారి ఇమామి ఖాసిమ్ తెలిపారు. ఈ మొత్తాన్ని ఆయా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారని ఆదివారం విలేకరులకు తెలిపారు.

నేడు సమన్వయ కమిటీ సమావేశం

బిక్కవోలు: మండలంలోని ఉపాధి హామీ పథకానికి సంబంధించిన సమన్వయ కమిటీ సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో జేఏ ఝాన్సీ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఉదయం 10 గంటలకు మండల పరిషత్ కార్యాలయం వద్ద 15వ విడత సామాజిక తనిఖీపై అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు సమన్వయం సమావేశం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలోని ప్రజాప్రతినిధులు హాజరుకావాలన్నారు.

వెన్నెముకను సంరక్షించుకోవాలి



రిపోర్టులను పరిశీలిస్తున్న వైద్యుడు

రాజానగరం: మానవ శరీరంలో ప్రధానమైన వెన్నెముకను సంరక్షించుకోవాలని డాక్టర్ తేజ ఫణీంద్ర అన్నారు. మండలంలోని శ్రీరామపురంలో ఆదివారం రాజమహేంద్రవరంలోని వేదస్పైన్ ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వెన్నెముక సమస్యతో బాధపడుతున్న 90 మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. డాక్టర్ తేజ ఫణీంద్ర మాట్లాడుతూ సమాజంలో సుమారు 80 శాతం మంది ఏదో ఒక సందర్భంగా వెన్నెనొప్పితో బాధపడుతుంటారన్నారు. సమస్య ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించి, చికిత్స చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు బోయిడి సుబ్రహ్మణ్యం, గంధం రాంబాబు, అసరా నాని, ఎస్.సత్తిబాబు పాల్గొన్నారు.

శివాలయంలో వేద పారాయణ



వేద పారాయణ చేస్తున్న పండితులు

రంగంపేట: గ్రామంలో భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి వారి దేవస్థానం (శివాలయం)లో ఆదివారం వేద పారాయణ నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం వేద పండితులు 30 మంది మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ నాలుగు వేదాలు పారాయణ చేశారు. టీటీడీ స్కీమ్ వేద పండితుల సూపర్ వైజర్ గుళ్లపల్లి దత్తాత్రేయ ఘనపాఠి పర్యవేక్షణలో స్థానిక వేద పండితులు పూజ్యం వీర వెంకట బ్రహ్మాజీశర్మ ఆధ్వర్యంలో గ్రామ ప్రజల ప్రోత్సాహంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ ఘనపాఠి మాట్లాడుతూ లోక కల్యాణార్థం ఈ వేద పారాయణ చేశామన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



ఘటనా స్థలంలో బుల్లెట్

రంగంపేట: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయని ఎస్సై టి.రామకృష్ణ తెలిపారు. ఆదివారం రాత్రి ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. రంగంపేట శివారు ఎస్టీ కాలనీ ఎదురుగా ఏడీబీ రోడ్డుపై సైకిల్‌పై రోడ్డు దాటుతున్న రావూరి గురునాథాన్ని రాజమహేంద్రవరం నుంచి కాకినాడ వైపు బుల్లెట్ బండిపై వెళుతున్న నురుకుర్తి నెహేమియా ఢీకొన్నాడు. బుల్లెట్ బండి అదుపు తప్పి రోడ్డు పక్కనున్న టాటాఏస్ వాహనాన్ని ఢీకొని ఇసుక గుట్టపై పడింది. ఈ ప్రమాదంలో బుల్లెట్ వెనుక కూర్చున్న కనపర్తి సాయికుమార్ తలకు బలమైన గాయం, నెహేమియా తల్లి నాగలక్ష్మికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మార్గమధ్యలో కనపర్తి సాయికుమార్(22) మృతి చెందాడని తెలిపారు. దీంతో మృతుడి తల్లి వీరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై చెప్పారు.

పిచికారీ వేళ.. అప్రమత్తతే రక్ష



నారుమడికి మందు కొడుతున్న రైతు



బిక్కవోలులో ట్రాక్టర్‌తో పొలంలో దమ్ములు

- జోరుగా ఖరీఫ్ పనులు
- పనుల్లో రైతులు బిజీ
- పురుగుమందుల పిచికారీలో జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వ్యవసాయాధికారులు

బిక్కవోలు: నియోజకవర్గంలో ఖరీఫ్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇటీవల వర్షాలు కురవడంతో రైతు వరినాట్లు మడులు పోశారు. ఇప్పటికే బోర్ల కింద వేసిన నారుమళ్లు వేసిన రైతులు పొలాలను దమ్ము చేసి పనిలో పడ్డారు. కొన్నిచోట్ల వరినాట్లు ప్రారంభమైనా మరోవారం రోజుల్లో ఈ పనులు జోరందుకోనున్నాయి. అనపర్తి నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో 54 వేల ఎకరాల్లో వరిని చేస్తున్నారు. ఇప్పటికి ఆరువేల ఎకరాలలో నారుమడులు పోశారు. అయితే నారుమళ్లపై పురుగు ముందులు పిచికారీ చేసే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

- పురుగు మందులను పిచికారీ చేసేటప్పుడు చేతులకు గ్లౌస్, ముఖానికి మాస్కు ధరించాలి.
- మందు ద్రావణం తయారు చేసేటప్పుడు నీరు, పొగతాగడం, ఆహారం తినడం వంటివి చేయకూడదు.
- సరైన నాజిల్ ఉన్న స్ప్రేయర్‌ను మాత్రమే పురుగు మందుల పిచికారీకి ఉపయోగించాలి.
- వ్యవసాయాధికారులు సిఫారసు చేసిన మోతాదు మేరకే మందును కలిపి వాడాలి.
- గాలి, ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు మందుల పిచికారీ చేయకూడదు.
- వర్షం కురిసే ముందు, కురిసిన తరువాత వెంటనే, గాలి వీచే దిశకు వ్యతిరేకంగా మందులు చల్లకూడదు.
- కలుపు మందులను మోతాదుకు మించి పిచికారీ చేస్తే పంటకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది.
- నకిలీ మందులను గుర్తిస్తే వెంటనే వ్యవసాయాధికారులకు సమాచారం ఇవ్వాలి.

పురుగు మందు కొనుగోలులో..

- ముందుగా పంటకు సోకిన తెగులును గుర్తించాలి.
- వ్యవసాయాధికారుల క్షేత్రస్థాయిలో పరిశీలన అనంతరం సిఫారసు చేసిన మందులనే వాడాలి.
- వివిధ సంస్థల ప్రతినిధుల ఏవైనా మందులను సూచిస్తే, వ్యవసాయాధికారుల దృష్టికి తీసుకెళ్లిన తర్వాతే వినియోగించాలి.
- పురుగు మందుల తయారీ, గడుపు తేదీలను పరిశీలించాలి.
- కొనుగోలు చేసిన ప్రతి మందుకు బిల్లు పొంది భద్రపర్చుకోవాలి.

జాగ్రత్తలు అవసరం



పొలాల్లో పురుగుమందు పిచికారీ చేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలి. అలాగే మందుల కొనుగోలు చేసే క్రమంలోని బిల్లు లేకుండా తీసుకోకూడదు. వ్యవసాయాధికారుల సూచనలు పాటిస్తే మెరుగైన ఫలితాలు ఉంటాయి.
– శామ్యూల్ జాన్, వ్యవసాయ అధికారి, బిక్కవోలు

గురు పౌర్ణమికి ఏర్పాట్లు పూర్తి



రామవరంలో భిక్షాటన చేస్తున్న సాయి దీక్షధారులు



అనపర్తి ఐఎల్‌టీడీ సమీపంలో సాయిబాబా

అనపర్తి: గురుపౌర్ణమిని పురస్కరించుకుని మండలంలోని సాయిబాబా ఆలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ఆలయ కమిటీల ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. స్థానిక బాబానగర్‌లోని ఐఎల్‌టీడీ సాయిబాబా ఆలయంలో గురు పౌర్ణమి నవమి వార్షికోత్సవాలకు అన్ని సిద్ధం చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. స్థానిక శేషగిరిరావుపేట, పాతవూరుల్లోని సాయి మందిరాల్లో పౌర్ణమి వేడుకలు అత్యంత వైభవంగా జరిపేందుకు ఏర్పాట్లు చేశారు. స్థానిక కెనాల్ రోడ్డులోని అయ్యప్పస్వామి ఆలయంలో టెలిఫోన్ గురుస్వామి ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరగనున్నాయి. రామవరంలోని అయ్యప్ప సహిత షిర్డీ సాయి ఆలయంలో సప్తాహం, విశేష హోమాది క్రతువులు ఘనంగా నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా సాయి దీక్షదారులు గ్రామంలో భిక్షాటన చేస్తున్నారు. భిక్షాటన ద్వారా వచ్చిన ద్రవ్యాలను ఈ నెల 4వ తేదీన భారీ ఎత్తున నిర్వహించే అన్నసమారాధన కార్యక్రమంలో వినియోగించనున్నట్టు కార్యక్రమాల పర్యవేక్షకుడు కర్రి వెంకటరెడ్డి తెలిపారు.

నేడు ప్రత్యేక పూజలు

మధురపూడి: వ్యాస పౌర్ణమి, గురు పౌర్ణమి సందర్భంగా సోమవారం బూరుగుపూడి, కోరుకొండ గ్రామాల్లోని సాయిబాబా ఆలయంలో క్షీరాభిషేకాలు, ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. బూరుగుపూడిలో ఆలయ గురువు మామిడిపల్లి రామారావు గురుపూజోత్సవం నిర్వహించనున్నారు. కోరుకొండ పెట్రోలు బంకు ఎదురుగా గల ఆలయంలో పంచామృతాభిషేకం నిర్వహిస్తారు. మధురపూడిలో ఆశ్రమంలో గురువు సుందర స్వామిని సత్కరిస్తారు.

రాజానగరం: స్థానిక షిరిడీ సాయిబాబా మందిరంలో సోమవారం గురు పూర్ణిమ వేడుకలు జరుగనున్నాయి. వేకువజామున ఇచ్చే కాకడ హారతి అనంతరం ఆలయంలో కొలువైన వినాయకుడు, దత్తాత్రేయుడు, సరస్వతీ మాత, సాయిబాబా విగ్రహాలకు ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహిస్తారు. ఉదయం 6 గంటల నుంచి సాయి భక్తమండలి ఆధ్వర్యంలో గురు చరిత్రను పారాయణ చేస్తారు. మధ్యాహ్న హారతి అనంతరం అన్నసమారాధన జరుగుతుంది.